بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ      نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِیْمِ      وَعَلٰی عَبْدِهِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Huzur-e-Anwar 27.03.2015 (Telugu)**

**అల్లాహ్, అతని సృష్టిలో ఏర్పడిన అంతరమును దూరము చేసి ప్రేమానురాగ, అభిమాన బంధమును మరల ఏర్పరచుటకు, ప్రపంచ తెర నుండి కనుమరుగైన ధార్మిక సత్యములను బహిర్గత పరచుటకు, మానసిక అంధకారముల క్రింద నలిగిపోయిన ఆధ్యాత్మికతను చూపుటకు అల్లాహ్ నన్ను నియమించెను.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 27.03.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన అవతరణ ఉద్దేశ ఐదు విభాగాలను ప్రస్తావించినారు. వాటిలో ఒక విభాగము కరపత్రముల ప్రచురణ. అనగా ప్రచారము, నిదర్శన ప్రచురణ. ఒక చోట వారిట్లనిరి.

వ్యతిరేకులు, తిరస్కృతుల ఆహ్వానము, నిదర్శనము పూర్తి చేయుటకు నేడు 40 కరపత్రములను ప్రచురించదలచితిని. తద్వారా నేను ఏ ఉద్దేశమునకై పంపబడినానో దానిని పూర్తి చేసినానని అల్లాహ్ ఆస్థానములో ప్రళయ దినమున చెప్పగలను. ఈ కొద్ది కరపత్రములే కాక గమనించినచో ప్రకటన కంటే ముందు నుండి మృతి చెందే వరకు అనన్య కరపత్రములు వారు ప్రచురించిరి. ఇవన్నీ ధార్మిక ప్రపంచ నిధి. ముస్లిములు, క్రైస్తవులు, ఇతర మతస్తులను కూడ వినాశనము నుండి రక్షించవలెనని వారిలో ఒక చింత యుండెను. వారు ఒంటరిగానే, ఎంతో కష్టపడి ఈ పని చేసేవారు. పెద్ద పెద్ద రచనలు కూడ యున్నవి. మానవ జాతి పట్ల ప్రేమానురాగ వ్యాకులత, ప్రపంచ సవరణ బాధ వారి కరపత్రముల ద్వారా బహిర్గతమగును. ప్రపంచ సవరణ అను బాధను కొనసాగించుట వారి జమాఅత్ సభ్యుల కర్తవ్యము కూడ. కనుక ఇటువైపు కూడ శ్రద్ధ వహించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ బాధ, ఇందుకు వారి అసాధారణ కష్టము గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఒక చోట ఇట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉదాహరణ మన ముందున్నది. అనారోగ్యముతో నున్నను దివారాత్రులు కష్టపడేవారు. కరపత్రము తర్వాత కరపత్రము ప్రచురించేవారు. వారి పనిని చూచి ప్రజలు ఆశ్చర్యపడేవారు. ఒక కరపత్రము ఇచ్చిన తర్వాత దాని ప్రభవాము అనగా ఆ కరపత్రము వలన ఏర్పడిన వ్యతిరేకత చల్లారక ముందే మరొ కరపత్రము ప్రచురించేవారు. ఈ సందర్భమున కరపత్రము జారీ చేయుట వలన ప్రజలలో దురభిప్రాయము ఏర్పడునని సభ్యులు అభిప్రాయపడేవారు. కాని వారు ఖాతరు చేయకుండా లోహమును వేడిలోనే మరల్చవచ్చునని అనేవారు. ఉత్సాహములో ఏ మాత్రం మెత్తదనము వచ్చినా వెంటనే మరో

కరపత్రము ప్రచురించేవారు. తద్వారా మరల వ్యతిరేకత ఉప్పొంగేది. వారు రాత్రింబవళ్లు ఇలాగే పని చేసిరి. ఇదే సఫలమునకు కారణము. ఈ కారణమును మనము అవలంభించినచో సఫలము కావచ్చును. వ్యతిరేకత తగ్గవలెనని ఆలోచించకూడదు. వ్యతిరేకత ఎదురగుచుండగానే కరపత్రము ప్రచురించవలెను. అప్పుడే ప్రభావము ఏర్పడును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలమునే హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ ప్రస్తావించుచు ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో కరపత్రముల ద్వారనే ప్రచారము జరిగేది. ఆ కరపత్రములు రెండు, నాలుగు పుటలలో యుండేవి. వాటి వలన దేశములో విప్లవము ఏర్పడేది. అధికముగా వాటిని ప్రచురించేవారు.

మూడు, నాలుగు సంవత్సరముల క్రితము ఒకటి రెండు పుటలతో కూడిన కరపత్రములు సిద్ధము చేసి ప్రచారము చేయవలెనని నేను జమాఅత్‌నకు సూచించితిని. లక్షల సంఖ్యలో చేయవలెనని టార్గెట్ కూడ ఇచ్చియుంటిని. తద్వారా ఇస్లాం అందమైన బోధన ప్రపంచమునకు తెలియును. ఇస్లాం వాస్తవికత ప్రపంచమునకు తెలియవలెను. ఈ కాలములో అల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను పంపి ఇస్లాం పునరుజ్జీవమునకు సంకల్పించి, నిజమైన బోధనను జారీ చేసినాడని తెలియవలెను. తన దాసులను షైతాన్ నుండి రక్షించుటకు ఇప్పటికి అల్లాహ్ తన దాసులను పంపునని ప్రపంచమునకు తెలియవలెను. ఈ విధముగా పని చేసిన జమాఅతులలో చాలా అనుకూల ఫలితములు వెలువడినవి. స్పేన్‌లో జామిఅ విద్యార్థులను నేను పంపియుంటిని. వారు చాలా పని చేసినారు. సుమారు మూడు లక్షల వరకు కరపత్రములు పంచిరి. ఇప్పుడు జామిఅ కెనడా విద్యార్థులు స్పేనిష్ దేశములలో, మెక్సికోకు వెళ్లి ఈ కరపత్రములను పంచినారు. అల్లాహ్ కృపానుసారము దీని వలన ప్రచార మైదానములో విశాల మార్గములు తెరుచుకొన్నవి. బైఅత్‌లు కూడ అయినవి. కనుక ఇందు కొరకు ఒక కరపత్రము తర్వాత మరొకటి ప్రచురించవలెను. పెద్ద పెద్ద పుస్తకముల బదులు వీటిని పంచిపెట్టుచు పోవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, అనుచరుల గురించి గల హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు తెలిపిన పలు సంఘటనలను ఇప్పుడు నేను ప్రస్తావింతును.

ఒక చోట వారిట్లనిరి. అఫ్ఘానిస్తాన్ అమరులపై రాళ్లు పడుచున్నప్పుడు వారు ఆందోళన చెందలేదు. స్థిరత్వము, ధైర్యముతో వాటిని స్వీకరించినారు. విపరీతముగా రాళ్లు పడినప్పుడు సాహిబ్జాదహ్ అబ్దుల్లతీఫ్ షహీద్, నీమతుల్లాహ్ ఖాన్ గారు ఇతర అమరులు ఇట్లనిరి. ఓ అల్లాహ్! వీరిని కరుణించి వీరికి మార్గదర్శనము ప్రసాదించుము. ప్రేమనురాగము మానవునిలో యున్నప్పుడు అతని రూపు రేఖలు మారిపోవును. అతని మాటలో ప్రభావము ఏర్పడును. అతని ముఖ కాంతి కిరణాలు ప్రజలను ఆకర్షించును. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. నాకింకా గుర్తున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో వేలాది మంది ఖాదియాన్ వచ్చినారు. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చూచినప్పుడు ఈ ముఖము అసత్యులది కాదని అనిరి. వారు వారి నోట ఒక్క అక్షరము కూడ వినకుండానే విశ్వసించిరి. ఈ ఉదాహరణలు నేడు కూడ మనకు కనిపించుచున్నవి. నాకు అనేక ఉత్తరములు వచ్చుచుండును. మేము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిత్రమును చూచి ఇది అసత్యుల ముఖము

కాజాలదని బైఅత్ చేసినాము.

మరల హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. మన జమాఅత్‌లో మూడు రకాల సభ్యులున్నారు. మొదటి రకము ఏమనగా నా ప్రకటనను అర్థము చేసుకొని, గమనించి అహ్మదీయులైనారు. నా అవతరణ ఉద్దేశమేమిటో వారికి తెలుసు. గతములో సందేశహరుల జమాఅత్‌లు ఏ విధముగా త్యాగములు చేసినవో మనము కూడ త్యాగములు చేయవలెనని వారికి తెలుసు. కాని మరొక రకము ఏమనగా వారు హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ గారి వలన మన జమాఅత్‌లో చేరినారు. మూడో రకమైనవారు కొందరు యువకులు. వారి హృదయములో ధార్మికంగా కాక జాతీయంగా ఇస్లాం బాధ యుండెను. ధార్మికంగా కాక ముస్లిముల ఒక వర్గము యుండవలెనని వారు భావించిరి. సాధారణ ముస్లిముల కొరకు ఒక వర్గము ఏర్పాటు చేయుట అసాధ్యమైనందున వారిలా ఒక వర్గము ఏర్పాటుకు భావించిరి. మన సమూహమును చూచి వారు మన వైపు వచ్చిరి. పాఠశాలలు ఏర్పాటై ప్రజలు పట్టాలు పొందవలెనని వారు కోరుచున్నారు. అందుకే వారు మన జమాఅత్‌ను ధర్మము కాదు ఒక వర్గముగా భావింతురు. ప్రపంచములో ప్రగతికి అనేక మార్గములు కలవు. ధర్మములో ప్రగతికి మార్గములు వేరు. ధర్మ ప్రగతికి సత్‌ప్రవర్తనలు, గొప్ప ప్రమాణములు అనివార్యము. త్యాగము, అంకిత భావము ఏర్పాటు కావలెను. ఆధ్యాత్మికతలో ప్రగతి చెందుటకు నమాజులు చదువవలెను. అల్లాహ్‌పై నమ్మకము పెంచుకోవలెను. విధేయతకై ప్రతిజ్ఞ చేయవలెను. మనము అన్ని విషయములు మాట్లాడినచో ప్రపంచ దృష్టిలో మనము పిచ్చివారమగుదుము. కాని అల్లాహ్ దృష్టిలో మన కంటే గవివేకవంతులు ఎవరుండరు. కనుక సర్వ సత్‌ప్రవర్తనలు, ఆధ్యాత్మికతలో అభివృద్ధి అను విషయములు ధార్మక జమాఅత్‌లలో తప్పనిసరి. కనుక ప్రతి అహ్మది తన విశ్వాస, ఆధ్యాత్మిక ప్రమాణములను గొప్ప స్థాయికి చేర్చవలెను.

ఉన్నత పాఠశాల స్థాపన నేపథ్యము, అవసరము గురించి వివరించుచు ఒక సంఘటన వారిట్లు తెలిపిరి. తర్వాత తాలీముల్ ఇస్లాం కళాశాల ప్రారంభమైనది. ఇన్ని లక్షలు మాకు వెంటనే కావలెనని అప్పుడు ఆలోచించుచుంటిమి. కళాశాల నడుపుటకు ఇన్ని లక్షల ఆదాయము అవసరముండును. లక్షలలో ప్రణాళికలు రూపొందించుచుంటిమి. వాస్తవానికి ఒకప్పుడు ఉన్నత పాఠశాల కొనసాగించుట కూడ కష్టముండెను. ఇక్కడ ఖాదియాన్‌లో ఆర్యుల ప్రాథమికోన్నత పాఠశాల యుండెడిది. ఆరంభములో ఇందులో మన విద్యార్థులు కూడ పోవడం మొదలు పెట్టిరి. మీరు మాంసము తీసుకోకూడదని ఆర్య ఉపాధ్యాయులు బోధించడం మొదలు పెట్టిరి. హిందువులు మాంసము భుజించరు. మాంసము భుజించుట హింస అనబడును. ఇస్లాంపై దాడులు జరిగే విధముగా వారు విమర్శలు చేసేవారు. విద్యార్థులు పాఠశాల నుండి వచ్చి ఆయా విమర్శలను తెలిపేవారు. ఇక్కడ ఖాదియాన్‌లో ఒక ప్రాథమిక పాఠశాల యుండెడిది. అందులో కూడ దాదాపు ఉపాధ్యాయులందరు ఆర్యులే యుండిరి. ఈ విషయములనే బోధించేవారు. మొదటి రోజు నేను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం కొరకు పోయినప్పుడు మధ్యాహ్న భోజనము కొరకు పాఠశాల ఆవరణలో ఒక వృక్షపు నీడన నేను కూర్చున్నాను. నాకింకా మంచిగా గుర్తున్నది. ఆ రోజు కాలేయము వండబడినది. నేను భుజించుటకు దానినే పంపిరి. అప్పుడు మియా అబ్దుల్లాహ్ గారి తండ్రి కీ.శే. మియా

ఉమర్‌దీన్ గారు అదే పాఠశాలలో చదివేవారు. కాని వారు తరగతిలో చదివేవారు. నేను మొదటి తరగతిలో యుంటిని. నేను భుజించుటకు కూర్చొనగా వారు కూడ వచ్చిరి. వాస్తవానికి వారు ముస్లిములైనను నన్ను చూచి నీవు మాంసము తింటున్నావా అని అనిరి. ఎందుకనగా ఆర్య ఉపాధ్యాయులు మాంసము తినుట హింస, దుష్టత్వమని బోధించిరి.

మన భావి తరాలు ఉన్నత విద్యాభ్యాసం చేయాలని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. క్రీ.శ.1944లో నేను కళాశాలకు పునాది వేసియుంటిని. ఒకప్పుడు మన జమాఅత్‌లో చాలా చిన్న పదవి, అతి కొద్ది ఆదాయము గల వారుండేవారు. నిస్సందేహముగా దీనితో జమాఅత్ చరిత్ర కూడ తెలియును. నిస్సందేహముగా కళాశాలలో చదివేవారు కూడ కొందరు అహ్మదీయులైనారు. కాని వారు అరుదుగా భావించబడిరి. అతి కొందరు తప్ప గొప్ప పదవీదారులు, అధిక ఆదాయము అర్జించువారు జమాఅత్‌లో చాలా తక్కువే యున్నారు. మన జమాఅత్‌లో ఏ పెద్ద వ్యక్తి లేకపోవడం కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమునకు నిదర్శనము. ఒక్క ఈ.ఏ.సి. మన జమాఅత్‌లో లేడు. అనగా ప్రభుత్వ అసిస్టెంట్ కమీష్నర్‌కు సమానముగా ఈ.ఏ.సి. ని భావించేవారు. ఇప్పుడు ఈ.ఏ.సి.లు వీధులలో తిరుగుచున్నారు. వారి వైపు ఎవరు కన్నెత్తి కూడ చూడరు. ఒకప్పుడు మన జమాఅత్‌లో పెద్దవారు చాలా తక్కువ యుండిరి. తుదకు మన జమాఅత్‌లో ఏ పెద్ద వ్యక్తి లేడు. మన జమాఅత్ ఒక్క ఈ.ఏ.సి.ని కూడ భరించలేదని హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ అనిరి.

నేడు అల్లాహ్ కృపానుసారము ప్రపంచములో వందలాది పాఠశాలలు, కళాశాలలు జమాఅత్ నడుపుచున్నది. ప్రపంచములోని వివిధ దేశములలో పెద్ద పెద్ద నిపుణులు, అధికారులు యున్నారు. అహ్మదీయులు దేశ పార్లమెంట్ సభ్యులుగా కూడ యున్నారు. ప్రాపంచికములోనే కాదు ఆధ్యాత్మికతలో కూడ ముందున్నారు. ఆఫ్రికాలోని పలు దేశములలో కొందరు అహ్మదీయులు ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను నిర్వహించుచున్నారు. అల్లాహ్ శుభములలో ఇదొక శుభము. ఏ విధముగా అల్లాహ్ ప్రగతి అందించుచున్నాడు.

ప్రారంభ అహ్మదీయులు ఎదుర్కొన్న కఠినములను, దైవానుగ్రహములను వివరించుచు వారిట్లనిరి. ఆరంభములో అహ్మదీయులను హింసకు గురిచేసేవారు. అహ్మదీయులను హతమార్చుట, వారి గృహములను దోచుకొనుట, వారి ఆస్తులను వశపరచుకొనుట, వారి స్త్రీలకు విడాకులు ఇవ్వకుండానే మరో చోట వివాహము చేయుట ధర్మబద్ధమే కాదు, పుణ్యకారణమని మౌల్వీలు తీర్మానించిరి. ప్రతి ఉదయము, ప్రతి సాయంత్రము తనతో క్రొత్త క్రొత్త ఆపదలు, బాధ్యతలను తీసుకొని వచ్చును. కాని أَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهٗ మధురమైన గాలి అన్నిటిని కట్టెపుల్ల వలే మటుమాయము చేసేది. జమాఅత్ భవనములను పెకిలి వేయుదుమని హెచ్చరించినప్పుడు అల్లాహ్ కృప, దయ మేఘాలు కమ్ముకొని أَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهٗ ద్వారా ధైర్యము కల్పించేది. అనగా ఇంత కఠిన పరిస్థితిలో కూడ అల్లాహ్ మాకు సరిపోవును, పరిస్థితులు انشاءالله మారిపోవునని నమ్మకముండేది. కొన్ని ఆపదలు వచ్చినను أَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهٗ ఆదుకొనును. ప్రపంచ నలు మూలలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్రములు కొనసాగుచున్నవి. మనము అల్లాహ్‌తో స్మరించినచో అల్లాహ్ ఎన్నడు వీడలేదు, انشاءالله వీడదు కూడ. నిస్సందేహముగా త్యాగములు సమర్పించవలసి యుండును.

కాని ప్రతి త్యాగము మనకు ఒక నూతన మార్గము తెరుచును. అల్లాహ్ ప్రసాదించుటలో ఎలాంటి లోపము రానివ్వడు.

దైవ రక్షణ మహిమ గురించి హ(జత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. దైవ రక్షణ ఉదాహరణలో భాగంగా హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితములోని ఒక సంఘటనను ప్రస్తావింతును. లా కాలెజ్ లాహెూర్ ప్రిన్సిపల్ ఖమర్ సీన్ తండ్రికి హ(జత్ గారితో సత్సంబంధముండెను. ఎంత వరకనగా హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఎప్పుడైనా నగదు అవసరమున్నచో వారితో రుణము తీసుకునేవారు. ఈ ఖమర్ సీన్ గారు హిందువులు. వారికి కూడ హ(జత్ గారి పట్ల ఎంతో అభిమానముండెను.

జీలం వాజ్యములో హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరపున వాదించాలని వారు తమ కుమారునికి టెలిగ్రామ్ పంపిరి. ఈ అభిమానమునకు కారణమేమనగా యవ్వనంలో వారు మరి కొందరు మిత్రులతో కలిసి హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వెంట సియాల్కోట్‌లో నివాసముండిరి. హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా అనేక సంకేతములను చూచిరి. ఆ సంకేతములలో ఒక సంకేతము ఏమనగా ఒక రాత్రి వారు (అ) మిత్రులతో కలిసి నిద్రించుచుండిరి. హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రాత్రి నిద్ర లేచిరి. గృహములో ప్రమాదమున్నదని వారికి ఆలోచన కల్పించబడెను. మిత్రులందరిని లేపి గృహములో ప్రమాదమున్నది, కనుక బయటికి వెళ్లవలెనని అనిరి. నిద్ర వలన మీకు అనుమానము కలిగినదని మిత్రులందరు మరల నిద్రించిరి. కాని వారి ఆలోచన పెరిగినది. మరల మిత్రులను లేపి పై కప్పులో బెనికిన శబ్దము వచ్చుచున్నది. గృహమును ఖాలీ చేయాలని అనిరి. మీరు మా నిద్రను ఎందుకు పాడు చేయుచున్నారు. కొన్ని కట్టెలలో ఇటువంటి శబ్దము కీటకముల వలన వచ్చును. ఇది సాధారణ విషయమేనని మిత్రులనిరి. సరే మీరు నా మాట వినే బయటికి వెళ్లండని హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్టుదలతో అనిరి. తుదకు మిత్రులు అనివార్య పరిస్థితి వలన బయటికి వెళ్లిరి. నా వల్లనే అల్లాహ్ ఈ గృహమును ఇంకా పడకుండా ఆపినాడని వారికి నమ్మకమున్నందున ముందు మీరు బయటికి వెళ్లండి తర్వాత నేను వస్తానను అనిరి. మిత్రులు బయటికి వచ్చిన తర్వాత వారు ఒక్క పాదము మెట్లపై పెట్టగానే పై కప్పు పడిపోయినది.

హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరో సంఘటనను తెలుపుచు వారిట్లనిరి. హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వయముగా ప్రస్తావించేవారు. ఒక సారి నేను అమృత్సర్ నుండి బటాలాకు వచ్చుటకు టాంగాలో ఎక్కినాను. ఒక భారీ శరీరము గల హిందువు నాతో టాంగాలో కూర్చొనెను. అతడు నా కంటే ముందు టాంగాలో కూర్చున్నాడు. తన సౌకర్యము కొరకు తన పాదాలను మంచిగా చాపినాడు. తుదకు నేను కూర్చొనే చోటును కూడ ఆక్రమించుకొనెను. కనుక నేను చాలా కొద్ది స్థలములో కూర్చున్నాను. ఆ రోజులలో వ్యక్తి స్పృహ కోల్పోయే స్థితిలో ఎండ తీవ్రముగా పడుచుండెను. మమ్ములను ఎండ నుండి రక్షించుటకు అల్లాహ్ ఒక మేఘమును ఏర్పాటు చేసెను. అది మా వెంట బటాలా వరకు వచ్చెను. మీరు అల్లాహ్ సమీపులుగా కనిపించుచున్నారని ఆ హిందువు అనెను.

మానవుడు ఆశ్చర్య పడే విధముగా అల్లాహ్ తన దాసులతో వ్యవహరించును. కాని ఆరాధన అనే

నిబంధన గలదు. ఇటువంటి వ్యక్తి అంతము శుభమగును. కాని అతడు ప్రాపంచిక వ్యక్తుల దృష్టిలో అవమానమును ఎదుర్కొనును. కాని తుదకు అతడు సత్కార్యము పొందును. అల్లాహ్ సరియైన దాసుడగును. అల్లాహ్ అతనికి అడగుడగున సహకరించును, ప్రతి నష్టము, దుష్టత్వము నుండి రక్షించును.

తన శిశువులపై మంచి ప్రభావము వేయుట, సత్కార్యములను పంచి పెట్టుట, శిశువుల శిక్షణ, మానవత్వము పట్ల కలత విషయములో ఒక సాధారణ సజ్జనుడు, అల్లాహ్ పంపిన అవతారుని మధ్య చాలా వ్యత్యాసముండును. దీనిని ఒక ఉదాహరణతో వివరించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. మున్షి అహ్మద్ జాన్ లుధ్యానా గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రకటన చేయక ముందే మృతి చెందిరి. కాని వారి ఆధ్యాత్మిక కాంతి చురుకుగా వున్నందున ప్రకటన కంటే ముందే వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఇట్లు వేడుకొనిరి.

ہم مریضوں کی ہے تمہی پہ نگاہ     تم مسیحا بنو خدا کیلئے

అనగా మా లాంటి రోగుల చూపు మీపైనే యున్నది. మీరు అల్లాహ్ కొరకు మసీహా కాగలరు.

ప్రపంచమును సవరించి, అల్లాహ్‌కు చేరువగా చేయుచుటకు పంపిన వ్యక్తులతో సాధారణ సజ్జనులు పోటీ పడలేరు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వయముగా ఇట్లు ఉపదేశించిరి. అల్లాహ్ అతని సృష్టిలో ఏర్పడిన అంతరమును దూరము చేసి ప్రేమానురాగ, అభిమాన బంధమును మరల ఏర్పాటుకు, ప్రపంచ తెర నుండి కనుమరుగైన ధార్మిక సత్యములను బహిర్గత పరచుటకు, మానసిక అంధకారముల క్రింద నలిగిపోయిన ఆధ్యాత్మికతను చూపుటకు అల్లాహ్ నన్ను నియమించెను. అన్నిటి కంటే కాంతివంతమైన దైవ ఏకత్వమును అన్యారాధన కలుషితము నుండి పవిత్రము చేసి ప్రపంచములో మరల శాశ్వతముగా నాటుటకు అల్లాహ్ నన్ను పంపినాడు.

బైఅత్ హక్కును చెల్లించుచు అల్లాహ్‌తో సరియైన సంబంధము ఏర్పాటు చేసుకొనుటకు అల్లాహ్ మనందరిని అనుగ్రహించుగాక! ధార్మిక సత్యమును గుర్తించి దానిని అమలు చేయువారమగుదుము గాక! నిజమైన దైవ ఏకత్వముతో కాంతిని పొందువారమగుదుము గాక! ప్రత్యేకముగా ముస్లిం సమాజము కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించవలెనని దుఆ చేయగలరు.

గౌ॥ నూమాన్ అహ్మద్ అన్జుమ్ గారు తండ్రి గౌ॥ చౌధ్రి మఖ్సూద్ అహ్మద్ గారిని కరాచీలో దివి: 21 మార్చి 2015 తేదీన దుకాణము వద్ద కాల్చి షహీద్ చేసిరి. ఇదే విధముగా గౌ॥ ఫారూఖ్ అహ్మద్ ఖాన్ గారు జిల్లా పిషావర్ ఉపాధ్యక్షులు 'అభిప్రాయ సమావేశము' తర్వాత తిరిగి పోవుచుండగా వాహన టైర్ పగిలి జరిగిన దుర్ఘటనలో మృతి చెందిరి. వెంటనే చక్వాల్ ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు వీడినారు. ఖుత్బా జుమా చివరలో హుజూర్ వీరిద్దరి సద్గుణములను, జమాఅత్ సేవలను ప్రస్తావించి దుఆ చేయాలని పిలుపునిచ్చిరి. అనంతరం వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివించిరి.

✡ ✡ ✡

*Summarised by: Majlis Ansarullah Bharat*
*Translated By Hafiz Syed Rasool Niyaz For Telugu Desk*
*From: Nazarath Nashr-O-Isha'ath, Qadian, Distt:Gurdaspur, Pin:143516, Punjab*